


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 10-09-2022 సంపుటి : 04 సంచిక : 21 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఏపీ పోలీసులకు హైకోర్టు షాక్..

# అమరావతి రైతులకు గ్రీన్ సిగ్నల్!

**అమరావతి రైతుల మహాపాదయాత్రకు హైకోర్టు అనుమతి**

**నిబంధనలు పాటిస్తూ పాదయాత్ర చేసుకోవచ్చన్న ధర్మాసనం**

**పాదయాత్ర దరఖాస్తుకు అనుమతించాలంటూ పోలీసులకు ఆదేశం**






అమరావతి రైతుల మహా పాదయాత్రకు ఏపీ పోలీసులు అనుమతి నిరాకరించిన కొద్ది గంటల్లోనే గ్రీన్ సిగ్నల్ లభించింది. అమరావతి నుంచి అరసవల్లి వరకు తలపెట్టిన మహా పాదయాత్రకు ఏపీ హైకోర్టు పరిమిత ఆంక్షలతో కూడిన అనుమతి ఇచ్చింది. పాదయాత్రకు డీజీపీ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో హైకోర్టులో రైతులు వేసిన పిటిషన్‌ను శుక్రవారం తొలి కేసుగా విచారించిన ధర్మాసనం పాదయాత్ర కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. అమరావతి రైతుల మహా పాదయాత్రకు ఏపీ పోలీసులు అనుమతి నిరాకరించిన కొద్ది గంటల్లోనే గ్రీన్ సిగ్నల్ లభించింది. అమరావతి నుంచి అరసవల్లి వరకు తలపెట్టిన మహా పాదయాత్రకు ఏపీ హైకోర్టు పరిమిత ఆంక్షలతో కూడిన అనుమతి ఇచ్చింది. పాదయాత్రకు డీజీపీ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో హైకోర్టులో రైతులు వేసిన పిటిషన్‌ను శుక్రవారం తొలి కేసుగా విచారించిన ధర్మాసనం పాదయాత్ర కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నెల 12 నుంచి తలపెట్టిన మహాపాదయాత్రలో 600 మంది పాల్గొనేలా హైకోర్టు అనుమతి ఇచ్చింది. పాదయాత్ర అనుమతి కోసం పోలీసులకు ఈరోజే దరఖాస్తు చేసుకోవాలని న్యాయస్థానం రైతులకు సూచించింది. రైతుల దరఖాస్తును పరిశీలించి వెంటనే అనుమతివ్వాలని ఆదేశాలు జారీ చేసింది. పాదయాత్ర ముగింపు సభకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. మహా పాదయాత్ర కోసం అమరావతి పరిరక్షణ సమితి కార్యదర్శి గద్దె తిరుపతిరావు, ఏ.శివారెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసి అనుమతి పొందారు.

# వ్యవసాయం చేయాల్సిందే - జగన్



విజయవాడ, సెప్టెంబర్ 9, వ్యవసాయ అనుబంధ రంగాలపై సమీక్ష నిర్వహించారు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. అధికారులకు కీలక సూచనలు చేశారు.. ఆర్బీకేల పరిధిలో వైయస్సార్ యంత్రసేవ కింద ఇస్తున్న పరికరాలు, యంత్రాలు అన్నీ కూడా రైతులకు అందుబాటులో ఉండాలని.. సంబంధిత ఆర్బీకేల పరిధిలో ఉన్న యంత్రాలు ఏంటి? పరికరాలు ఏంటి? వాటిద్వారా ఎలాంటి సేవలు లభిస్తాయన్న వివరాలు ఆర్బీకేల్లో ఉంచాలన్నారు. ఈ వివరాలతో సమగ్రమైన పోస్టర్లను ఆర్బీకేల్లో డిస్‌ప్లే చేయాలన్న ఆయన.. అందుబాటులో ఉన్న యంత్రాలు, వాటి సేవల వివరాలను సమగ్రంగా రైతులకు తెలియజేసేలా ఈ పోస్టర్లను రూపొందించాలన్నారు.. ఈ సందర్భంగా వైయస్సార్ యంత్రసేవ కింద పంపిణీ చేసిన వ్యవసాయ ఉపకరణాల వివరాలను సీఎంకు అందించారు అధికారులు. 10,750 ఆర్బీకేల పరిధిలో ఇప్పటికే 6525 ఆర్బీకేల్లో యంత్రసేవకింద వ్యవసాయ ఉపకరణాల పంపిణీ ఇప్పటికే పూర్తి కాగా.. 1615 క్లస్టర్ లెవల్ సీహెచ్‌సీల్లో 391 చోట్ల ఇప్పటికే యంత్రసేవ కింద హార్వెస్టర్లతో పాటు పలు రకాల యంత్రాలు ఆర్బీకేలకు పంపిణీ చేశారు. 690.87 కోట్ల విలువైన పరికరాలు అందించింది ప్రభుత్వం. ఇందులో 240.67 కోట్ల సబ్సిడీ అందించింది సర్కార్.ఇక, మిగతా ఆర్బీకేల్లో కూడా 2022?23కు సంబంధించి యంత్ర సేవకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేశారు.. సుమారు 7 లక్షల మందికి యంత్రాలు, పరికరాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.. 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు యంత్రసేవకింద పరికరాలు, మిగిలిన 20శాతం మిగిలిన వారికి.. షెడ్యూల్డ్ ఏరియాల్లో 80శాతం ఎస్టీ రైతులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది సర్కార్.. ఆర్బీకే యూనిట్‌గా వీటి పంపిణీ జరగాలని స్పష్టం చేశారు సీఎం వైఎస్ జగన్.. దీని కోసం రూ.1325 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు.. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ.1014 కోట్లుగా ఉంది.. ఆర్బీకేల పరిధిలో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌రూమ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని.. వీలైనంత త్వరగా వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని.. అలాగే ఆర్బీకేల్లో గోదాముల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేయాలని.. చేయూత ద్వారా సుస్థిర ఆర్థిక ప్రగతికి స్వయం ఉపాధి పథకాలు కొనసాగించాలని, వారికి పశువులను పంపిణీ చేయడం ద్వారా పాల ఉత్పత్తి, విక్రయం తదితర వ్యాపారాల ప్రక్రియ కొనసాగాలని సూచించారు.. దీని వల్ల మహిళల్లో ఆర్థిక స్వావలంబన జరుగుతుందన్నారు సీఎం వైఎస్ జగన్.అమూల్, అలానా లాంటి కంపెనీలతో భాగస్వామ్యం వల్ల లబ్ధిదారులైన మహిళలకు ఆర్థికంగా ప్రయోజనం పొందేలా చూడాలన్నారు సీఎం వైఎస్ జగన్.. అమూల్ పాలసేకరణపై కూడా సమీక్ష నిర్వహించిన ఆయన.. 2,34,548 మహిళా రైతుల నుంచి అమూల్ పాల సేకరణ జరుగుతోంది.. ఇప్పటి వరకూ 419.51 లక్షల లీటర్ల పాల సేకరణ చేశాం.. పాల సేకరణ వల్ల ఇప్పటి వరకూ రూ.179.65 కోట్ల చెల్లింపు, రైతులకు అదనంగా 20.66 కోట్ల లబ్ధి చేకూరినట్టు తెలిపారు.. అమూల్ ప్రాజెక్టు వల్ల ఇతర డెయిరీలు పాల సేకరణ ధరలు పెంచాల్సిన పరిస్థితి ఉందన్నారు.. ఆయా డైరీలు ధరలు పెంచడం వల్ల రాష్ట్రంలో రైతులకు అదనంగా రూ.2,020.46 కోట్ల లబ్ధి వనగూరిందని.. వచ్చే రెండు నెలల్లో మరో 1,359 గ్రామాలకు అమూల్ పాల సేకరణ విస్తరించేందుకు ప్లాన్ చేస్తున్నారు.. అమూల్‌తో ప్రాజెక్టు ద్వారా ప్రతిరోజూ 1.03 లక్షల లీటర్ల పాల సేకరణ జరగాలన్నారు. చిత్తూరు డెయిరీని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని ఆదేశించారు సీఎం జగన్.ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు సీఎం.. ఫేజ్?1లో చేపట్టిన జువ్వలదిన్నె, మచిలీపట్నం, నిజాంపట్నం పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయన్న అధికారులు.

## బాలాపూర్ లడ్డూ వేలం.. రూ.450 నుంచి రూ.24లక్షల వరకు..

హైదరాబాద్: వినాయకచవితి వేడుకలు పూర్తవుతున్నాయంటే చాలు.. అందరి దృష్టి హైదరాబాద్‌లోని బాలాపూర్ లడ్డూ వేలంపైనే ఉంటుంది. ఈ లడ్డూలో అనేక మహిమలు ఉన్నాయని..దాన్ని దక్కించుకునే వారిని ఆ గణనాథుడు చల్లగా చూస్తాడనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఎంతో మంది ఈ లడ్డూ కోసం పోటీ పడుతుంటారు. 1994లో తొలిసారిగా నిర్వహించిన వేలంలో రూ.450 పలికిన లడ్డూ ధర.. ఏటేటా భారీగా పెరుగుతూ వచ్చింది. తాజాగా రూ.24.60లక్షలకు బాలాపూర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుడు వంగేటి లక్ష్మారెడ్డి దక్కించుకున్నారు.



# పాదయాత్ర కాదు.. విశాఖపై దండయాత్ర.. ఉత్తరాంధ్ర ఊరుకోదు..



"అమరావతి ప్రాంతానికి రాజధాని కావాలని చేస్తున్న యాత్ర కాదు.. విశాఖపట్నానికి రాజధాని వద్దూ అని చేస్తున్న దండయాత్ర. దీనికి ఎవ్వరం ఊరుకోం. ఈ ప్రాంత ప్రజలు అంగీకరించారు" అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహా పాదయాత్ర పేరుతో అమరావతి నుంచి అరసవల్లి వరకు సాగుతున్న పాదయాత్రపై ఆయన స్పందించారు. మూడు రాజధానులకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

**పాదయాత్రలో శాంతి భద్రతలు లోపిస్తే చంద్రబాబే కారణం**

**విశాఖపై దండయాత్ర చేస్తే ఇక్కడి ప్రజలు ఊరుకోరు**

**మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతాం: మంత్రి అమర్‌నాథ్**

కట్టుబడి ఉందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ, అమరావతి, కర్నూలు రాజధానులను చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు కేవలం తన స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజలను మోసం చేశారని.. 29 గ్రామాల కోసమే ఉద్యమం చేస్తున్నారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు. కానీ, ఈరోజు మహా పాదయాత్ర పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తున్నారంటూ మంత్రి ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారంటూ మంత్రి అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి గొడవలు జరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగినా దానికి చంద్రబాబే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పాదయాత్ర పేరుతో దండయాత్ర చేస్తే జనం చూస్తూ ఊరుకోరంటూ హెచ్చరించారు. మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతామని.. అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లు పెడతామని.. ఆ తర్వాత ఎప్పుడైనా సీఎం విశాఖ రావొచ్చంటూ మంత్రి పేర్కొన్నారు.

# ప్రపంచంలో అయిదో ఆర్థికశక్తిగా భారత్

**ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ ఘనత: ప్రధాని మోదీ**

సూరత్: భారతదేశం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికశక్తిగా అవతరించడం సాధారణ విజయం కాదని, ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గుజరాత్‌లోని సూరత్‌లో గురువారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని దిల్లీ నుంచి ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతోనూ ముచ్చటించారు.



'అమృతోత్సవాలు నిర్వహిస్తున్న ప్రస్తుత ఆనందకర సమయంలో మన దేశం ఇటీవల అయిదో ఆర్థికశక్తిగా అవతరించింది. మనం మరింత కష్టపడి ఇలాంటి మరెన్నో ఘనతలను సాధించాలి. ఎనిమిదేళ్ల పాలనలో దేశవ్యాప్తంగా పేదల కోసం 3 కోట్ల ఇళ్లను నిర్మించాం. వాటిలో దాదాపు 10 లక్షల ఇళ్లు గుజరాత్‌లోనే ఉన్నాయి. తక్కువ ఖర్చుతో ఆశించిన దిగుబడి వచ్చే ప్రకృతి సేద్యం వైపు రైతులు మళ్లాలి. మేం రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుండటంతో కేంద్రంతోపాటు గుజరాత్‌లోనూ వారు మమ్మల్ని దీవిస్తున్నారు' అని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. పుస్తకాలకు ప్రత్యామ్నాయం లేదు.. సమాచారాన్ని అందివ్వడంలో ఇంటర్నెట్ కీలకంగా మారినా, అది పుస్తకాలకు ప్రత్యామ్నాయం కాలేదని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. గురువారం అహ్మదాబాద్‌లో కలమానో కార్నివాల్ పేరిట ఏర్పాటు చేసిన పుస్తక మేళాలో ప్రధాని వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. 'గ్రంథాలు, పుస్తకాలలోని జ్ఞానం మరింత ప్రభావవంతంగా, ఉపయుక్తంగా మారడానికి వాటిని మన పూర్వీకులు మళ్లీ మళ్లీ చదివించేవారు. మన మెదడులో నిక్షిప్తమైన విజ్ఞానం... ప్రయోగాలకు, కొత్త ఆవిష్కరణలకు దారులు వేస్తుంది. అందుకే పుస్తకాలను డిజిటల్ లేదా ప్రింట్‌లలో ఏదో ఒక రకంగా తప్పనిసరిగా చదవాలి' అని ఆయన పిలుపునిచ్చారు.

# పోలీస్‌స్టేషన్ నాకు ఇప్పుడు అత్తారిల్లులా మారిపోయింది: లోకేశ్

గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అన్నం పెట్టడం సంగతి అటుంచి అన్నా క్యాంటీన్లు పెట్టినవారిని కొడుతోందని తెదేపా ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. గుంటూరు జిల్లా తెనాలిలోని చినరావూరులో ఇటీవల మృతిచెందిన తమ పార్టీ నేత పాటిబండ్ల నరేంద్రనాథ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు.



2019 ఎన్నికల తర్వాత నరేంద్రనాథ్ తనకు పరిచయమయ్యారని గుర్తు చేసుకున్నారు. మంగళగిరి, కుప్పం, తెనాలిలో అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం అడ్డుకుంటోందని మండిపడ్డారు. అసలు ప్రభుత్వం ఎందుకు ఇంతలా భయపడుతోందని ప్రశ్నించారు.తెదేపా నేతలపై దాడులు జరుగుతున్నాయని.. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక చూస్తూ ఊరుకొనేది లేదని హెచ్చరించారు. జగన్ తాత రాజారెడ్డికే భయడపలేదని.. ఈయనకు భయపడతామా? అని వ్యాఖ్యానించారు. తనపై 15 కేసులు పెట్టారని.. ఏడు సార్లు జైలుకు తీసుకెళ్లారని లోకేశ్ అన్నారు. ప్రజలకు మంచి చేయాలన్నదే తమ పార్టీ లక్ష్యమని.. వైకాపా నేతల దాడులకు భయపడేది లేదన్నారు. గతంలో ఎన్నడూ పోలీస్ స్టేషన్ గడప తొక్కని తనకు ఇప్పుడు పోలీస్ స్టేషన్ అత్తారిల్లులా మారిపోయిందని చమత్కరించారు. ఈ పర్యటనలో లోకేశ్ వెంట పార్టీ సీనియర్ నేతలు ఆలపాటి రాజా, నక్కా ఆనందబాబు తదితరులు ఉన్నారు.

# చట్ట సభలను అగౌరవ పరుస్తున్న జగన్ రెడ్డి

**యనమల రామకృష్ణుడు**

అమరావతి ప్రభుత్వ, ప్రతిపక్ష పార్టీలకు చట్టసభలు ప్రజాకోర్టు లాంటివి. ప్రభుత్వ పాలనా తీరు, ప్రజా సమస్యల పరిష్కారం చట్టసభలో చర్చించే వేదిక. ప్రజాస్వామ్యంలో చట్టసభల ప్రాధాన్యతను జగన్ రెడ్డి తగ్గించే కుట్ర చేస్తున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు.. ప్రభుత్వ చేతగాని పాలనను ప్రతిపక్షాలు నిలదీస్తాయని జగన్ రెడ్డికి భయం పట్టుకుంది. శాసనసభలు విధిగా నిర్వహించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలం అయ్యింది. చట్టసభలకు హాజరవ్వడం సభ్యుని ప్రధాన బాధ్యత. ఈ చట్టసభల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తేనే ప్రజాస్వామ్యం మెరుగ్గా ఉంటుందని రాజ్యాంగ నిర్మాతలు కూడా భావించారు. కాని జగన్ ప్రభుత్వం మాత్రం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుంది. ఏడాదికి సగటున 25 రోజులు మించి చట్టసభలు నిర్వహించలేదు. గత ఏడాది కేవలం 15 రోజులు మాత్రమే నిర్వహించారు. ఈశాన్య రాష్ట్రాల కంటే తక్కువ రోజులు సభలు నిర్వహించారు. చట్టసభలు ఎక్కువ రోజుల నిర్వహిస్తేనే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చట్టసభలు నిర్వహించకుండా తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆరాటపడుతుంది. వ్యవసాయం నుండి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం అయ్యింది. మౌలిక సదుపాయాలు, విద్యుత్, వ్యవసాయ రంగాలు పడిపోయాయి, జలవనరుల ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయి, రోడ్లు అధ్వానంగా ఉన్నాయి, విద్యా రంగం అట్టడుగు స్థాయికి చేరింది. అనేక సమస్యలతో ప్రజలు కొట్టు మిట్టాడుతున్నారు.



వీటన్నింటిపై చట్టసభల్లో ప్రతిపక్ష పార్టీ ప్రశ్నిస్తుందన్న భయంతోనే తక్కువ రోజులు సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుంది. ఆ హక్కునే లేకుండా జగన్ రెడ్డి చేస్తున్నారు.

# చంద్రబాబుకు సుప్రీంలో ఊరట..

**లక్ష్మీపార్వతి పిటిషన్ కొట్టివేత**

అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు ఆస్తులపై దివంగత ఎన్టీఆర్ సతీమణి, వైసీపీ నాయకురాలు లక్ష్మీపార్వతి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది . చంద్రబాబు ఆస్తులపై విచారణ జరపాలని ఆమె పిటిషన్ దాఖలు చేసింది . ఒకరి ఆస్తులు తెలుసుకోవడానికి మీరెవరిని ప్రశ్నించింది . హైకోర్టులో వేసిన పిటిషన్‌ను అన్ని విధాలా ఆలోచించే హైకోర్టు కొట్టివేసిందని గుర్తు చేసింది. ఎవరి ఆస్తులు ఎవరికి తెలియాలని ప్రశ్నించింది. మీరు లేవనెత్తిన అంశంలో విలువలేదని పిటిషన్‌ను డిస్మిస్ చేసింది .



చంద్రబాబు ఆస్తులపై విచారణ జరిపించాలని లక్ష్మీపార్వతి 2005లో పిటిషన్ దాఖలు చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్ లో చంద్రబాబు చూపిన ఆస్తుల వివరాల ఆధారంగా లక్ష్మీపార్వతి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1987 నుంచి 2005 మధ్య చంద్రబాబు భారీగా ఆస్తులు కూడబెట్టారని, దీనిపై విచారణ జరిపించాలని ఆమె పిటిషన్ లో పేర్కొన్నారు.

# కమలం ట్రాప్ లో జనసేనాని..?

కాకినాడ సెప్టెంబర్ 9, ఎరక్కపోయి వచ్చాను ఇరుక్కు పోయాను, ఏ సినిమాలోదో ఏమో కానీ,ఈ సాంగ్ ఒక్కప్పుడు బాగా పాపులర్ అయిన పాటల్లో ఒకటి. అక్కినేని నాగేశ్వర రావు, వాణిశ్రీ, ఈ పాటకు స్టెప్పులేస్తుంటే హాల్లో ఈలలే ...ఈలలు. అయితే, ఇప్పుడు సిట్యువేషన్, అది కాక పోయినా, రాజకీయ నాయకుడిగా అవతారం ఎత్తిన, ప్రముఖ హీరో, జన సేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పరిస్థితి కూడా అలాగే ఉందని అంటున్నారు ఆయన అభిమానులు. బీజేపీ, జనసేన మిత్ర పక్షాలు. 2019 ఎన్నికలకు ముందు బీజేపీతో తెగతెంపులు చేసుకున్న పవన్ కళ్యాణ్ ఎన్నికల తర్వాత మళ్ళీ బీజేపీతో జట్టు కట్టారు. మాంగల్యానికి మూడు ముళ్ళు అన్నటుగా బీజేపే మెడలో మరో మూడు ముళ్ళు వేశారు. అయితే, ఆ తర్వాత, 'చెలియ లేదు చెలిమి లేదు, వెలుతురే లేదు' అన్నట్లుగా, 'చేసుకున్న బాసలు, చెప్పుకున్న ఉసులు' ఏమై పోయాయో కానీ, ఎవరి దారిన వారు, అడుగులు వేస్తున్నారు,నడక సాగిస్తున్నారు. అయినా, బీజేపీ నాయకులు టీవీ చర్చల్లో జనసేన తమ మిత్ర పక్షం అనే అంటారు. 2024 ఎన్నికల్లో ఇద్దరం కలిసి దుమ్ముదులిపేస్తాం అంటారు.అధికారం మాదే అంటారు. అంతే, అంతకు మించి ఇంకొక్కమాట మాట్లాడరు. అలాగే, ముఖ్యమంత్రి ఎవరన్నది బీజేపీ నాయకులు వాళ్ళంతట వాళ్ళు చెప్పరు. చివరకు, జనసేన నాయకులు సిగ్గువిడిచి, నోరు తెరిచి అడిగినా, బీజేపే నేతలు పెదవి విప్పరు. పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రి అభ్యర్ధిగా ప్రకటించాలని ప్ల కార్డులు పట్టుకుని, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఎదుట ప్రదర్శనలు చేసినా, పట్టించుకోరు. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా, పార్టీ జాతీయ నాయకులు వచ్చి పోతుంటారు, కానీ, రాష్ట్రంలో మిత్ర పక్షం ఒకటుందని ఒక్కరు కూడా కనీసం గుర్తించనైనా గుర్తించరు. ఒక పిలుపు ఒక పలకరింపు ఏవీ ఉండవు. మెగా ఫ్యామిలీ స్టార్ హీరో, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పక్కనే ఉన్నా ఆయన్ని పట్టించుకోరు, కానీ అదే అమిత్ షా జూనియర్ ఎన్టీఆర్ తో గంటలు భేటీ అవుతారు. బీజేపీ అధ్యక్షుడు నడ్డా, మరో హీరో నితిన్ తో భేటీ అవుతారు. సరే ఆయన కలుద్దామనుకున్నది నితిన్ ను కాదు, మరో కుర్ర హీరో నిఖిల్ ని అనీ, ఏదో కమ్యూనికేషన్ గ్యాప్ తో అల జరిగిపోయిందని అంటున్నారు. సరే, ఆయన కలవాలనుకున్నది నితిన్ అయినా నిఖిల్ లేదా హీరో ఎవరైనా ఆది ఇప్పుడు అప్రస్తుతం. మెగా ఫ్యామిలీ పవర్ స్టార్ అని కాకపోయినా, మిత్రపక్షం అధ్యక్షుడిగా అయినా జాతీయ నాయకులు రాష్ట్రానికి వచ్చినప్పుడు,పవన్ కళ్యాణ్ ను కనీసం హలో అని అయినా పలకరించాలి కదా, అని ఆయన అభిమానులు నొచ్చుకుంటున్నారు.బీజేపీ ఉచ్చులో చిక్కుకుని, పవన్ కళ్యాణ్ ఎటూ కాకుండా, త్రిశంకు నరకంలో తేలియాడుతున్నారని అంటున్నారు. అయితే, కొంచెం చాలా ఆలస్యంగానే అయినా పవన్ కళ్యాణ్ బీజేపీ గేమ ప్లాన్ అర్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మిత్ర పక్షం పేరును అడ్డుపెట్టుకుని జనసేనను బీజేపీ నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని, అందుకే, పవన్ కళ్యాణ్ బిగ్ బ్రదర్, మెగా స్టార్ చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ సహా అనేక మంది హీరోలను తమ గూటికి తెచ్చుకునే ప్రయత్నం కమల దళం చేస్తోందని అంటున్నారు పవన్ కళ్యాణ్ బీజేపీ కబంధ హస్తాల నుంచి ఎంత త్వరగా బయట పడితే అంత మంచిదని పవన్ కళ్యాణ్ హితేషులు సూచిస్తున్నారు. నిజానికి, పవన్ కళ్యాణ్ మార్చిలో జరిగిన జనసేన ఆవిర్భావ సభలోనే, వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను అంతం చేయడమే తమ లక్ష్యమని ప్రకటించారు. అందుకే, వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చెదిరి పోకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే జనసేన ముందు మూడు ప్రత్యన్మాయాలున్నాయని వివరించారు. అయితే, బీజేపీ మాట తప్పి పక్క చూపులు చూస్తున్న తాజా పరిణామాల నేపధ్యంలో, బీజేపీతో పొత్తు ఆప్షన్ ఇక లేనట్లేనని అంటున్నారు. పవన్ కళ్యాణ్ ముందు రెండే ప్రత్యన్మాయాలున్నాయని, అందులో ఒంటరిగా పోటీచేసే ఆప్షన్ , మరొకటి తెలుగు దేశంతో పొత్తు ఆప్షన్ అని అంటున్నారు. అయితే, దేనికైనా సరైన సమయం రావలసి ఉంటుందని అంటున్నారు. అయితే పవర్ స్టార్ అభిమానులు మాత్రం ఎదురు చూపులు ఇక చాలు అంటున్నారు. అంతేకాదు, పవర్ స్టార్ అభిమానులే కాకుండా మెగా అభిమానులు కూడా బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలని పవన్ కళ్యాణ్ పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

## నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

**-ఆత్మహత్యలు వద్దు-నిండైన జీవితం ముద్దు**

ఈ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 10న జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారణకోసం ప్రజల్లో అవగాహన కలిగించడానికి 2003వ సంవత్సరం నుండి ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది.. ఆత్మహత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మహత్యల నివారణకు చూపిన చొరవ దాని అమలుకొరకు చేసిన ప్రణాళికలకు సంబంధించి ప్రస్తావించబడింది. ఆత్మహత్యకు ముందు ప్రవర్తనల గురించి అవగాహన పెంచడానికి, వాటిని ఎలా సమర్థవంతంగా నిరోధించాలో తెలియజేయడానికి ప్రపంచ, ప్రాంతీయ, జాతీయ బహుళ-రంగ కార్యకలాపాల సంస్థ ఏర్పాటుచేయాలని, ఆ సంస్థ ద్వారా జాతీయ విధానాలు, ఆత్మహత్యల నివారణ ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి, అంచనా వేయడానికి దేశాల సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. 2014లో విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ మానసిక ఆరోగ్య నివేదిక ప్రకారం, తక్కువ ఆదాయం ఉన్న దేశానికి జాతీయ ఆత్మహత్యల నివారణ ప్రణాళిక లేదని, తక్కువ-మధ్యతరగతి ఆదాయపు దేశాలలో 10% కన్నా తక్కువగా, ఎగువ-మధ్య-అధిక ఆదాయ దేశాలలో దాదాపు మూడవ వంతుగా ఉన్నట్లు నివేదించింది. 2011లో ఒక అంచనా ప్రకారం ఈ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 40 దేశాలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల సందర్భంగా మానసిక వైద్య నిపుణులచే సదస్సులు నిర్వహిస్తారు.ఆత్మహత్యల నివారణ దినోత్సవం గుర్తుగా పసుపు, నారింజ రంగు రిబ్బన్లను చేతులకు కట్టుకుని ఆత్మహత్యలు వద్దు - నిండైన జీవితం ముద్దు అంటూ నినాదాలు చేస్తూ, అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు.

## రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడవుతారా?.

తిరువనంతపురం, సెప్టెంబర్ 9 (న్యూస్ పల్స్)ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు. ఓ కాంగ్రెస్ నాయకుడిగా తాను యాత్రలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. తాను ఈ యాత్రకు నాయకత్వం వహించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నాగర్‌కోయిల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంత వరకు ఇది ప్రజల కష్టాలు తెలుసుకునే అద్భుత అవకాశమన్నారు. దేశయాత్రకు కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందన్నారు. విపక్షాలపై బీజేపీ ఈడీ, సీబీఐలను ఉసిగొల్పుతోందని ఆయన విమర్శించారు.ప్రజలతో మమేకం కావడానికే ఈ యాత్ర అని రాహుల్ అన్నారు. బీజేపీ సిద్ధాంతాల వల్ల దేశానికి జరిగిన నష్టం, ద్వేషానికి వ్యతిరేకంగా ఈ యాత్ర చేపట్టామన్నారు. ఈ దేశంలోని అన్ని సంస్థలను బీజేపీ తన ఆధీనంలోకి తీసుకుందని.. వాటి ద్వారా ప్రతిపక్షాలపై ఒత్తిడి తెచ్చిందన్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఈరోజు తాను పార్టీ అధినేత పదవికి దూరంగా లేనని సూచించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ సమాధానం ఇచ్చారు. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగినప్పుడు (కాంగ్రెస్) అధ్యక్షుడిని అవుతానా లేదా అనేది స్పష్టమవుతుందన్నారు. తాను ఏమి చేయాలో చాలా స్పష్టంగా నిర్ణయించుకున్నానన్నారు. తన మనస్సులో ఎలాంటి గందరగోళం లేదన్నారు.ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నవంబర్ 17న ఎన్నికలు జరగనుండగా, రెండు రోజుల తర్వాత ఓట్ల లెక్కింపు జరగనుంది. సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. కాంగ్రెస్ కపిల్ సిబల్, అశ్వనీ కుమార్, గులాం నబీ ఆజాద్‌లతో సహా అనేక ఉన్నత స్థాయి నిష్క్రమణల పతనాన్ని ఎదుర్కొంటోంది, గాంధీయేతర వ్యక్తి పార్టీని అధ్యక్షుడిగా నడిపించగలరా అనే ప్రశ్నతో కాంగ్రెస్ ఇంకా పోరాడుతోంది. ఆ పార్టీ అధినేత్రి సోనియాకు రాసిన లేఖలో రాహుల్ గాంధీ తీరును ఆజాద్ తీవ్రంగా ఖండించారు. రాహుల్ అపరిపక్వత కాంగ్రెస్ పార్టీని నాశనం చేసినట్లు ఆజాద్ ఆరోపించారు. పార్టీలో సంప్రదింపు వ్యవస్థను రాహులే ధ్వంసం చేసినట్లు విమర్శలు గుప్పించారు. దురదృష్టవశాత్తు రాహుల్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పార్టీలో ఉన్న పాత విధానాలు దెబ్బతిన్నట్లు ఆజాద్ ఆరోపించారు.

## భూముల్లో గోతులు...ఆందోళనలో రైతులు

కడప, సెప్టెంబర్ 9, ఉన్నట్టుండి పొలాల్లో పడుతున్న పెద్ద పెద్ద గొయ్యలు కడప జిల్లాలో రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. చింతకొమ్మదిన్నె మండలంలోని రుద్రయ్యగారిపల్లెలో పసుపు పొలంలో పడ్డ గొయ్య గతేడాది లాగా వరుసగా భూమి కుంగిపోతుందా అన్నంతగా జనం హడలిపోతున్నారు. ఒక గొయ్యి పూడ్చడానికి మూడు నుంచి నాలుగు లక్షలు ఖర్చలవుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. కడప శివారు గ్రామాల్లో మళ్లీ రైతుల్లో గతేడాది భయాందోళనలే వ్యక్తం అవుతున్నాయి. ఉన్నట్టుండి భూమి కుంగిపోవడం, పెద్ద గొయ్యి పంటపొలాల్లో ఏర్పడటం రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.అకస్మాత్తుగా ఏర్పడుతున్న లోతైన గొయ్యిపుడి, భూమిపై ఉన్న చెట్లు, ఇళ్లు, బావులు లోపలికి వెళ్ళిపోతున్నాయి. తాజాగా చింతకొమ్మదిన్నె మండలం రుద్రయ్యాగారిపల్లెలో ఇలాంటి గొయ్యే ఒకటి పడింది. గ్రామంలోని తుమ్మల విష్ణు వర్ధన్ రెడీకి చెందిన సర్వే నెంబర్ 7/2 లొ 15 అడుగుల వెడల్పు, 20 అడుగుల లోతు తో పెద్ద గొయ్యపడింది. అందులోనుంచి నీరు ఊరుతోంది. ఈగొయ్యకి దగ్గర్లోనే వంక కూడా ఉంది. అయితే ప్రస్తుతం అందులో నీటి ప్రవాహం లేదు. గతంలో చింతకొమ్మదిన్నె మండలం మామిళ్ళ పల్లె పంచాయితీ మాయనోళ్లపల్లెలో పాఠశాలలోని వాటర్ ట్యాంక్ ఇలాగే భూమి కుంగి లోనికి వెళ్ళిపోయింది. దీంతో పాఠశాలలను మార్చివేశారు.ఎనిమిదేళ్ల క్రితం 2014 నవంబర్ లో మొదటగా అగ్రహారం సమీపంలోని బుగ్గలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలోని వాగు వద్ద ఒకేరోజు పదుల సంఖ్యలో పెద్ద పెద్ద గుంతలుగా భూమి కుంగిపోయింది. తరువాత ఇవి విస్తరిస్తూ నాయనోరిపల్లె, పెద్ద ముసల్ రెడ్డి పల్లె, గూడవాండ్ల పల్లె గ్రామాలకు విస్తరించి నెల రోజుల వ్యవధిలో 50 కి పైగా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తం కావడంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించడంతో ప్రభుత్వం స్పందిచింది భూమి కుంగిపోవడం, ఆకస్మికంగా ఏర్పడతున్న మార్పులపై భూగర్భ శాస్త్ర వేత్తలు, జియలాజికల్ సర్వే అఫ్ ఇండియా నిపుణుల బృందం తో పరీక్షలు చేయించింది.ప్రత్యేక నిపుణుల బృందం ఈ ప్రాంతంలో పర్యటించి భూమి కుంగిన ప్రదేశాలను పరిశీలించింది కూడా. ఎగువన ఉన్న బుగ్గవంక ప్రాజెక్టులో నీరు చేరడం వల్ల అందులోని నీటి ఊటలు భూగర్భం ద్వారా భూమి పొరల్లోకి వెళ్లి డొల్లగా మారి గుంతలు ఏర్పడుతున్నట్లు నిపుణుల బృందం తేల్చింది. గ్రామంలోని నివాస ప్రాంతాలకు సమీపంలోని గుంతలను గట్టి మట్టి, కాంక్రీట్ మిశ్రమాలతో పూడ్చాలని సూచించడంతో పాటు గ్రామం సమీపంలో ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించాలని కూడా సూచించింది. అయితే నిపుణులు సూచించిన ఏ పనినీ జిల్లా యంత్రాగం చేపట్టలేదు. దీంతో ఇప్పుడు తాజాగా భూమి కుంగి గుంతలు ఏర్పడటం మళ్లీ పునరావృతమైంది. బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో ఇలాంటి గొయ్యలు ఏర్పడే పరిస్థితి వస్తుందా అన్న అనుమానాలు ఎక్కువయ్యాయి.ఇప్పుడు రుద్రయ్యగారిపల్లెలో పడ్డ గొయ్యను పూడ్చడానికి కనీసం మూడు నుంచి నాలుగు లక్షల ఖర్చు అవుతోంది. అంతంతమాత్రమే ఉన్న రైతులలకు పొలాల్లో పడ్డ గొయ్యలను పూడ్చుకోవడం తలకు మించిన భారమే అవుతుంది. ప్రభుత్వమే ఈ నష్టాన్ని నివారించాలని రైతులు కోరుతున్నారు. అయితే గతేడాది లాగే ఇలా గొయ్యలు పడటం మొదలైతే ఎక్కడెక్కడ పడతాయో అన్న భయం వారిని వెంటాడుతోంది. జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఈ గొయ్యలు పడే పరిస్థితిపై ప్రత్యేక దృష్టిపెట్టి, నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విశాఖపట్టణం పై జీవీఎల్ గురి



విశాఖపట్టణం, సెప్టెంబర్ 9, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విశాఖపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయన ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరో ఏడాదిలో ఆయన పదవీ కాలం త్వరలోనే కానుంది. మరోసారి బీజేపీ నుంచి రాజ్యసభకు నామినేట్ అయ్యే అవకాశాలు లేవు. ఏపీ బీజేపీ గురించి పెద్దగా అధినాయకత్వం పట్టించుకోవడం లేదు. అసలు పదవులు అంటేనే ఏపీ బీజేపీ గుర్తుకు రావడం లేదు. రాజ్యసభ పదవి ఏపీకి మరోసారి కేటాయిస్తారనుకోవడం భ్రమే అవుతుంది. అది ఆయనకు కూడా తెలియంది కాదు.ఇప్పటి వరకూ అనేక పదవులు భర్తీ చేసినా ఏపీ బీజేపీ నాయకులను పక్కన పెట్టేసింది. కంభంపాటి హరిబాబుకు గవర్నర్ పదవి ఇవ్వడం తప్ప ఏపీలో ఏ నేతకు ఈ మూడేళ్ల కాలంలో పదవి ఇచ్చిన దాఖలాలు లేవు. కేంద్ర మంత్రివర్గంలోనూ ఏపీకి ప్రాతినిధ్యం లేదు. పొరుగున ఉన్న తెలంగాణకు అన్ని పదవులు వెళ్లిపోతున్నాయి. అక్కడ పార్టీ బలోపేతం అవుతుండటంతో కేంద్ర నాయకత్వంపై తెలంగాణపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఏపీలో సీనియర్ నేతలను అసలు పట్టించుకోవడం లేదు. వచ్చే రెండేళ్లు కూడా ఇక్కడి నేతలకు పదవులు దక్కుతాయన్న ఆశలు లేవు. వచ్చే ఎన్నికలలో దీంతో జీవీఎల్ నరసింహారావు వచ్చే ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి లోక్‌సభకు పోటీ చేయాలని భావిస్తున్నట్లే కనపడుతుంది. అందుకే ఆయన గత కొద్ది రోజులుగా విశాఖపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఢిల్లీ టు విశాఖ కు తిరుగుతున్నారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. విశాఖలో జీవీఎల్ నరసింహారావు క్యాంప్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఎక్కువ సమయం అక్కడే ఉండి పార్టీ క్యాడర్ ను మంచి చేసుకుంటున్నారు. వారితో తరచూ సమావేశమవుతున్నారు. విశాఖ కేంద్రంగానే ఆయన రాజకీయాలు ప్రారంభించినట్లు కాస్త పరికించి చూసిన వారికెవరికైనా అర్థమవుతుంది. విశాఖ పార్లమెంటు సీటు గెలుచుకోవడం సులువు. అతి పెద్ద నగరం, కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు ఉండటంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు అక్కడ నివాసముంటున్నారు. మోదీ ప్రభుత్వం పట్ల అనుకూలంగా ఇతర రాష్ట్రాల ప్రజలు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గతంలో అనేక సార్లు బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. కులాలు, మతాలకు సంబంధం లేకుండా ఇక్కడ విజయం ఉంటుంది. కొద్దిగా కష్టపడితే ఇక్కడ విజయం సాధించడం సులువవుతుంది. అయితే పురంధ్రీశ్వరి ఈ సీటుకు పోటీ పడతారంటున్నారు. ఆమెను విజయవాడకు షిఫ్ట్ చేస్తే తాను విశాఖలో పోటీ చేయవచ్చన్నది జీవీఎల్ నరసింహారావు ఆలోచనగా ఉంది. అందుకే ఇటీవల ప్రధాని మోదీని కలిసి విశాఖలో వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు రావాలని ఆయన ఆహ్వానించారని తెలుస్తోంది. మొత్తం మీద జీవీఎల్ కలలు తీరాలంటే ముందు చిన్నమ్మ విజయవాడలో పోటీ చేసేందుకు అంగీకరించాలి. లేకుంటే ఆయన కలలు ఉప్పు సముద్రం పాలు కాక తప్పదు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

చిత్తూరు చిత్తూరు నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని విజయలక్ష్మి శుక్రవారం వేకువజామున అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. అయితే విజయలక్ష్మి మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని బాలిక బంధువులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. తమ బిడ్డ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. బాలిక ఆరోగ్యం పట్ల వసతి గృహ అధికారులు శ్రద్ధ వహించకపోవడంతోనే బాలిక మృతి చెందిందని చెప్పారు. ఈ సంఘటనపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే చిత్తూరు డిఎస్పి సుధాకర్ రెడ్డి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిస్థితి ని అదుపు చేశారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతికి సంబంధించిన కారణాలు వెల్లడవుతాయని చెప్పారు. చిత్తూరు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజ్యంగ పదవులపై ఆసక్తి లేదు

గుంటూరు, సెప్టెంబర్ 9,నేను క్షేత్ర స్థాయి నుండి భారత దేశ రెండో అత్యున్నత పదవి వరకు వెళ్లాను.. నాకు ఇచ్చిన బాధ్యత నేను సమర్ధవంతంగా నిర్వహించాను.. కానీ, నాకు నచ్చిన పదవులు రాజ్యాంగ పదవులు కాదు.. ప్రజలతో మమేకమయ్యే పదవులు నాకు ఎంతో ఇష్టం అంటూ మరోసారి తన మనసులోని మాటలను బయటపెట్టారు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు.. ఏపీలో పర్యటిస్తున్న ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ.. తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.. నిన్నటి నిన్నే ఆయన.. తాను తల్లి ప్రేమకు నోచుకోలేదు.. నన్ను పార్టీయే పెంచిందని వ్యాఖ్యానించిన ఆయన.. ఇవాళ గుంటూరులో మిత్రులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో చిరకాల మిత్రులు, శ్రేయోభిలాషులు, ఆత్మీయులు, పురప్రముఖులను కలిశారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తనకు రాజ్యాంగ పదవులు నచ్చవంటూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.. చట్ట సభలు చాలా ముఖ్యమైనవి? వాటిని కాపాడాల్సిన బాధ్యత మన మీద ఉందని.. చట్ట సభల స్థాయి తగ్గడం సమాజానికి మంచిది కాదని.. వాటి పరిధిలు, హక్కులు రాజ్యాంగంలో పొందు పరిచారని.. చట్టాలు అమలు చేయాల్సిన వారు గాడి తప్పి వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.కొంత మంది చేస్తున్న పనులు వల్ల చట్ట సభల స్థాయి తగ్గి పోతుంది.. దీనిపై చర్చ జరగాలని సూచించారు వెంకయ్యనాయుడు.. ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతిపక్షాలు హుందాగా వ్యవహరించాలి.. కానీ, చట్ట సభల్లో దుర్భాషలాడటం ఒక ట్రెండ్ గా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇక, సెప్టెంబర్ 9 ఆంధ్రపత్రిక ఆవిర్భావ దినోత్సవం.. ఆంధ్ర పత్రిక ఆవిర్భావం ఆ నాటికి సాహసం.. ఈ నాటికి దుస్సాహసం.. కానీ, రాజకీయ ప్రయోజనాల కోసం ఈ రోజు పత్రికలు నడుపుతున్నారు.. ఆ విధానం మారాలని సూచించారు.. మరోవైపు, స్వాతంత్ర్య పోరాటం లో సుభాష్ చంద్రబోస్ పాత్ర అనిర్వచనీయం.. మహాత్మ గాంధీ నాయకత్వంలో స్వతంత్రం ఉద్యమంలో ఎంతో మంది పోరాడారు.. వారి పేర్లతో నూతన నిర్మాణాలు చేయాలని పేర్కొన్నారు.. కుటుంబ పాలకుల నాయకుల పేర్లు కాదు? మాతృ భాష ను కాపాడుకోవాలి.. పరిపాలన కూడా ప్రజల భాషలో జరగాలన్నారు. కోర్టు తీర్పులు కూడా తెలుగులోనే ఉండాలి.. మాతృ భాషలో చదువుకున్న వారు దేశంలో శక్తి వంతమైన భాధ్యతలు నిర్వహించారని.. ప్రధాని మోడీ, సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రమణ, నేను ఊర్లలో మాతృ భాషలో చదువుకున్న వాళ్లమే అని గుర్తుచేసుకున్నారు ఎం. వెంకయ్యనాయుడు.

## నేతాజి అస్థికలు తెప్పించండి

విజయవాడ, సెప్టెంబర్ 9 (న్యూస్ పల్స్)ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్.. ఆయనకు ఒక విజ్ఞప్తి కూడా చేశారు.. వలసవాద పాలనా చిహ్నాలను చెరిపేస్తున్న మోడీ అభినందనీయులని పేర్కొన్న పవన్.. కర్తవ్య పథ్ అనేది భారతీయత ఉట్టిపడే నామ ధేయం.. బ్రిటీష్ పాలనలో కింగ్స్ వే .. ఆ తరవాత రాజ్ పథ్ గా మారి ఇప్పుడు కర్తవ్య పథ్ గా అవతరించింది.. బ్రిటీష్ రాచరిక పాలన అంతరించి 75 ఏళ్ళు గడిచినా వారి వలసవాద పాలనకు ఇంకా మానని గాయాలుగా మిగిలిన సజీవ గుర్తులను తుడిచేయడం సంతోషించాల్సిన విషయం అన్నారు.. 75వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సంకల్పంతో వలస వాద పాలనలో ఉద్భవించిన పేర్లు మరియు చిహ్నాలను తొలగించాలని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు.. ఆ వాగ్దానాన్ని అమలు చేస్తుండడం హర్షణీయమన్న ఆయన.. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగానే జపాన్ లో భద్రపరచిన నేతాజీ అస్థికలను కూడా రప్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనుమరాలు రాజశ్రీ చౌదరీ బోస్ అనుమతితో ఆమె డీఎన్ఏతో వాటిని సరిపోల్చవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.. ఇది సాకారమైతే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లక్ష్యం సిద్ధిస్తుందని.. భారత జాతి విముక్తి కోసం పోరాడిన ఆ మహనీయునికి నివాళిగా మిగిలిపోతుందన్నారు పవన్ కల్యాణ్.కాగా, దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంటు, రాష్ట్రపతి భవన్, ఇండియా గేట్ పరిసరాల్లో ఇన్నాళ్లు రాజ్‌పథ్‌గా కొనసాగిన చారిత్రక నిర్మాణం.. కర్తవ్య పథ్‌గా మారిన విషయం తెలిసిందే.. రాజ్‌పథ్‌కు మరిన్ని అధునాతన సౌకర్యాలను చేరుస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మరింత సుందరంగా తీర్చిదిద్దింది.. అంతేకాకుండా కర్తవ్య పథ్‌లోనే 25 అడుగుల ఎత్తైన నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. గురువారం నేతాజీ విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఆవిష్కరించారు.

## అన్నమయ్య జిల్లాకు చేరిన అనా క్యాంటీన్లు

కడప, సెప్టెంబర్ 9, అన్న క్యాంటీన్‌ల లొల్లి అన్నమయ్య జిల్లాను టచ్ చేసింది. ఓవైపు అన్న క్యాంటీన్‌కి పర్మిషన్ లేదని పోలీసులు.. ఎందుకు ఇవ్వరని టీడీపీ శ్రేణులు మరోవైపు వాగ్వాదానికి దిగారు. ఇది కాస్తా చినికి చినికి గాలివానగా మారింది వివాదం. 144 సెక్షన్ విధించేదాకా వెళ్లింది. పెద్ద తిప్పసముద్రంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసింది టీడీపీ. పెద్ద సంఖ్యలో కార్యకర్తల మధ్య ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే శంకర్ వెళ్లారు. అంతలోనే ఎంట్రీ ఇచ్చిన పోలీసులు.. అనుమతి లేదంటూ ఒక్కమాటలో తేల్చేశారు. దీంతో షాకయిన తెలుగు తమ్ముళ్లు ఆందోళనకు దిగారు. అప్పటిదాకా ప్రశాంతంగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా వేడెక్కింది. తెలుగు తమ్ముళ్ల నినాదాలతో దద్దరిల్లింది. పేదోళ్ల కడుపు నింపే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే అభ్యంతరాలు ఎందుకని ప్రశ్నించారు నేతలు. ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు ఓవరాక్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు సిట్యువేషన్ సీరియస్‌గా మారకముందే 144 సెక్షన్ అనౌన్స్ చేశారు. తీవ్ర ఉద్రిక్తతల మధ్య అన్న క్యాంటీన్ ప్రారంభించారు. దీంతో తెలుగు తమ్ముళు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న అనుమానంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్ద తిప్ప సముద్రంలో భారీగా మోహరించారు. మొన్న కుప్పంలో దాడి.. నిన్న తెనాలిలో అభ్యంతరాలు.. ఇలా ఎక్కడో ఒకచోట అన్న క్యాంటీన్లపై రగడ కంటిన్యూ అవుతూనే ఉంది.

## మునిసిపల్ కార్మికులపై దాడి..

కుత్బుల్లాపూర్ పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలోని గుండ్లపోచంపల్లిలో మున్సిపల్ కార్మికుల పై దాడి జరిగింది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మినీ ట్యాంక్ బండ్ పై ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి వెళ్లిన మున్సిపల్ సిబ్బందిపై రాజు గౌడ్ అనే వ్యక్తి విచక్షణ రహితంగా దాడి చేసాడు. అసభ్య పదజాలంతో బూతులు తిడుతూ వారితో గొడవకు దిగాడు. ఈ దాడిలో ఐదుగురు మున్సిపల్ కార్మికులు గాయపడ్డారు. అసభ్య పదజాలంతో మమ్మల్ని దూషించి,గాయపరిచిన రాజు గౌడ్ పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# కర్నూలు జిల్లా సర్పంచుల అవగాహన సదస్సు



ఉమ్మడి కర్నూలు జిల్లా, కర్నూలు టౌన్ లో ఏర్పాటుచేసిన సర్పంచుల అవగాహన సదస్సు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని సర్పంచుల సమస్యల పట్ల ప్రసంగించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ మమ్ములను నమ్మి మాకు ఓటేసిన మా గ్రామాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం, మహాత్మా గాంధీ కలలుగన్న "గ్రామ స్వరాజ్య" సాధన కోసం మేము కోరుతున్న డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే మా న్యాయబద్ధమైన 12 డిమాండ్ల సాధన కోసం, మమ్ములను గెలిపించిన మా గ్రామీణ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రంలోని 12918 మంది సర్పంచులు లో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు పార్టీలకతీతంగా ఐక్యమై ఉద్యమిస్తామని, రాజీలేని పోరాటాలు చేస్తామని మా ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా మని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఓఅదేవిధంగా వైయస్సార్ సిపి ఎమ్మెల్యేల సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాలకు ఇచ్చిన 20 లక్షల నిధులను గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు ఇవ్వవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామనిచెప్పారు మా గ్రామ పంచాయతీలకు ఇవ్వవలసిన 7660 కోట్ల ఆర్థిక సంఘం నిధులను దారి మళ్ళించి దొడ్డిదారిన గ్రామ సచివాలయాల ద్వారా వైఎస్ఆర్ సిపి ఎమ్మెల్యేలకు ఇచ్చి గ్రామాల్లో, పట్టణాల్లో వారితో పనులు చేయించి రాజకీయ అనుచిత లబ్ధి పొందాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సిగ్గుచేటైన విషయం అని....సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు చేయవలసిన పనులను ఎమ్మెల్యేల చేత, వాలంటీర్ల చేత చేయించాలని ముఖ్యమంత్రి గారు ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పట్ల వ్యవహరిస్తున్న తీరు 73, 74 వ రాజ్యాంగ సవరణ చట్టాలకు వ్యతిరేకం, అనైతికం అని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.అలాగే సచివాలయాలకు చేయూత అని ఒక్కొక్క సచివాలయానికి 20 లక్షల రూపాయలను విడుదల చేయవలసిందిగా జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసి ఆ నిధులతో ఆ ప్రాంతంలో పనులు చేసుకోమని ఎమ్మెల్యేలకు చెప్పడం దారుణ మనీ, ఆ నిధులను సచివాలయాలకు, ఎమ్మెల్యేలకు, వాలంటీర్లకు కాకుండా గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు ఇచ్చి సర్పంచుల, ఎంపీటీసీలు, కౌన్సిలర్ లు, కార్పొరేటర్ల చేతనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చేయించవలసిన దిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ మరియు రాష్ట్ర సర్పంచుల సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు మరియు సర్పంచ్లు, ఎంపీటీసీలు,కౌన్సిలర్లు, కార్పొరేటర్ల పట్ల చిన్నచూపు చూస్తూ, గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఇది 73, 74 వ రాజ్యాంగ సవరణ చట్టాలకు వ్యతిరేకం అని...ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం గ్రామ పంచాయతీలను, మున్సిపాలిటీ లను నిర్వీర్యం చేసి, సర్పంచులను, ఎంపీటీసీ లను, కౌన్సిలర్ల ను, కార్పొరేటర్లను ఉత్సవ విగ్రహాలు లాగా మారుస్తోందని అసలు ప్రజలకు కావాల్సిన రోడ్లు,డ్రైన్లు, త్రాగునీరు, శానిటేషన్ మొదలగునవి కల్పించవలసినటువంటి బాధ్యత రాజ్యాంగం ప్రకారం సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల దే తప్ప- చట్ట ప్రకారం గ్రామ సచివాలయ లకు, వాలంటీర్లకు, ఎమ్మెల్యేలకు ఎటువంటి సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు పోటీగా సమాంతర సచివాలయ వ్యవస్థ ను, వాలంటీర్లను ఏర్పాటుచేసి మా స్థానిక ప్రభుత్వాల నిధులు,విధులు, అధికారాలను హైజాక్ చేసి సచివాలయాలకు కట్టబెడుతున్నార నీ, ఇది చూస్తూ మేము సహించేది లేదని.గ్రామ సచివాలయాలకు విడుదల చేసిన నిధులతో పాటు, కేంద్ర ప్రభుత్వం 14, 15 వ ఆర్థిక సంఘాల ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు పంపించిన 7660 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి తన సొంత అవసరాలకు వాడుకున్నదని కనుక ఆ రూ,,7660 కోట్లను కూడా మా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని రాజేంద్ర ప్రసాద్అన్నారు.

# నారాయణ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

## బిఎసెఫ్ బిటిఎసెఫ్ ఎబివిపి డిమాండ్






డోన్ : నంద్యాల జిల్లా డోన్ పట్టణం లోని నారాయణ విద్యా సంస్థ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ విజయభాస్కర్ భారత తెలుగు స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎం శివన్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ డోన్ సెక్రెటరీ గౌతమ్ మరియు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలుగా రూపాయలు ఫీజులు వసూలు చేస్తు కనీసం పాఠశాల యొక్క బిల్డింగ్ పర్మిషన్ రెన్యూవల్ మరియు పురపాలక సంఘం యొక్క ఎన్ఓసి రెన్యువల్ చేయకుండా నారాయణ విద్య సంస్థ విచ్చలవిడిగా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు అదేవిధంగా విద్యార్థులను కేవలం విద్య కోసమే పరిమితం చేశారు అదేవిధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారికి తగినటువంటి ప్లేగ్రౌండ్ కూడా లేకుండా నారాయణ విద్యాసంస్థ నిర్వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు తెలిపారు. అదేవిధంగా నారాయణ పాఠశాలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోని డోన్ నారాయణ పాఠశాల యొక్క గుర్తింపు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తు నారాయణ స్కూల్ ముందు నిరసన తెలియజేసి అనంతరం పై సమస్యలతో కూడిన ఎంఈఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ యొక్క పరిష్కారాన్ని ఎంఈఓ గారు పరిష్కరించని ఎడల డిఇఓ గారి లేదా కలెక్టర్ గారి దృష్టి కూడా తీసుకెళ్లడం జరుగుతుంది అని వారు అన్నారు ఈ యొక్క సమస్యకు పరిష్కారం కానీ ఎడల పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించడం జరుగుతుంది. అని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు వెంకటేష్ గోపాల్ రవి చంద్ర పాల్గొన్నారు

# పదోన్నతులు చేపట్టాలి..బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలి.

## ఎస్టీయు రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు

కోసిగి:- రాష్ట్రంలో అప్గ్రేడేషన్ మరియు పాఠశాలల విలీన కార్యక్రమంలో భాగంగా ఏర్పడిన ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల సహాయకుల పోస్టులను పదోన్నతల ద్వారా త్వరగా భర్తీ చేయాలని ఈరోజు కోసిగి మండల సభ్యత నమోదు కార్యక్రమంలో ఎస్.టి.యు రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు ప్రభుత్వాన్ని కోరారు.ఈరోజు జరిగిన సభ్యత నమోదు కార్యక్రమంలో ఆయా పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా మేము ఉంటామని ఉపాధ్యాయులకు హామీ ఇవ్వడం జరిగింది.అదేవిధంగా స్థానిక మండల పరిషత్ పాఠశాల హెచ్.జి ప్రధానోపాధ్యాయుడు సంజన్న గారి పదోన్నతి ఇంక్రిమెంటు దాదాపు సంవత్సరం కావస్తున్న ఇంతవరకు మండల విద్యాధికారులు మంజూరు చేయలేదని అతనికి ఖచ్చితంగా ప్రమోషన్ ఇంక్రిమెంట్ అరియర్స్ ను తక్షణమే మంజూరు. చేయాలని కోరారు ఉపాధ్యాయ బదిలీల నిబంధనలు పూర్తి అసంబద్ధం గా వున్నాయని వాటిని సవరించే ఉపాధ్యాయ బదిలీల జీవోను విడుదల ముఖ్యంగా బదిలీ నిబంధనలో ప్రభుత్వం మినిమం 2 సంవత్సరాలు గరిష్టంగా 5 సంవత్సరాల నిబంధన ఆలోచనను విరమించుకొని ఉపాధ్యాయుల స్టేషన్ మినిమం జీరో సర్వీస్ ను లాంగ్ స్టాండింగ్ 8 సంవత్సరాలను రూపొందించి బదిలీల జీవోను విడుదల చేయాలని అన్నారు.

# పాఠశాలలో పందుల మకాం




## బడి పిల్లలపై దాడులు చేస్తున్న పందులు




కోసిగి :విషజ్వరాలు డెంగ్యూ ఇతరత్రా ప్రాణాంతక వ్యాధులు అతి వేగంగా ప్రబలుతున్న తరుణం లో జిల్లా వైద్యాధికారులు కలెక్టర్ జిల్లా వైద్య యంత్రాంగం తో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నట్టే కోసిగిలో మాత్రం వైద్యాధికారులు గ్రామ పంచాయితీ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేనట్లుతుంది మాకెందుకు లే అన్న రీతిన వ్యవహరిస్తున్నారు సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కార్యక్రమాలు సచివాలయ ల ద్వారా నిర్వహిస్తున్న కోసిగి పట్టణం లో 3వార్డు నందు ఆంధ్ర పాఠశాల అవరణం ముందు పందులు స్వైర విహారం చేస్తూ మధ్యాహ్నం భోజనం సమయంలో కూడా పాఠశాల అవరణంలో తీరుగుతూ ఉండడం తో మధ్యాహన్నం భోజన సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అక్కడే ఉన్న ప్రజలు విద్యార్థులకు విష జ్వరాలు వస్తున్నాయ్ అని .అలాగే రాత్రి అక్కడే ఆ మూడో వార్డు ప్రాంతంలో ఉన్న ప్రజలల ఇళ్ళల్లోకి రాత్రి పూట ఇళ్లలోకి చొరబడుతున్నాయని .పగలు రాత్రి నిద్ర లేకుండా లేకుండా చేస్తూ పందులు స్వైర విహారం చేస్తూన్న అధికారులు పట్టించుకోవడం లేదని మూడో వార్డు ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ పందుల వ్యవహారం గుర్తించి పంచాయతీ అధికారులు ఇతర అధికారులు స్పందించి ఈ పందుల వ్యవహారం శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# తమిళ దర్శకుడితో తెలుగు హీరోయిన్ పెళ్లి..?



టాలీవుడ్ హీరోయిన్ తెలుగు అమ్మాయి ఈషా రెబ్బా ఓ తమిళ డైరెక్టర్ తో ప్రేమలో పడిందని.. త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. 'అంతకు ముందు ఆ తర్వాత' అనే సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీకి పరిచయమైన ఈషా రెబ్బా.. 'బందిపోటు' 'అమీ తుమీ' 'మాయా మాల్' 'దర్శకుడు' 'సుబ్రహ్మణ్యపురం' 'బ్రాండ్ బాబు' 'అ!' 'అరవింద సమేత వీరరాఘవ' 'రాగల 24 గంటల్లో' వంటి సినిమాల్లో నటించింది.అందంతో పాటు అభినయం కలబోసిన ఈషా కు ఆశించిన స్థాయిలో క్రేజీ ఆఫర్స్ మాత్రం రాలేదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో 'పిట్టకథలు' అనే వెబ్ సిరీస్ తో ఓటీటీలో అడుగుపెట్టిన ఈ బ్యూటీ.. '3 రోజేష్' సిరీస్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది.మరోవైపు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటూ.. తన హాట్ హాట్ ఫొటో షూట్స్ తో నెట్టింట రచ్చ చేస్తూ వస్తోంది ఈషా. ఈ క్రమంలో తమిళ మలయాళ కన్నడ ఆఫర్లు అందుకుంటున్న తెలుగు అందం.. ఇప్పుడు పక్కన ఇండస్ట్రీలలో అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది.ఈ క్రమంలో ఓ తమిళ్ డైరెక్టర్ తో ప్రేమలో పడిందని.. త్వరలోనే అతడితో ఏడడుగులు వేయబోతుందని కోలీవుడ్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వీరి ప్రేమను ఇరు కుటుంబాలు అంగీకరించారని.. త్వరలో పెళ్లి ఏర్పాట్లు చేయనున్నారని తమిళ మీడియా కోడై కూస్తోంది.ఈషా రెబ్బా పెళ్లి ప్రేమాయణం వార్తల్లో నిజమెంతుందో తెలియాలంటే తెలుగమ్మాయి స్పందించే వరకు వేచి చూడాలి. ఇక ఈషా పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో హాల్ చల్ చేస్తుండటంతో ఆ తమిళ దర్శకుడు ఎవరా అని అందరూ ఆరా తీస్తున్నారు.ఇక సినిమాల విషయానికొస్తే.. ఈషా ప్రస్తుతం తమిళ హీరో జీవీ ప్రకాష్ సరసన 'ఆయిరమ్ జెన్మంగల్' అనే చిత్రంలో నటిస్తోంది. అలానే 'ఒట్టు' అనే తమిళ మలయాళ ద్విభాషా చిత్రంలో హీరోయిన్ గా చేస్తోంది. ఇక కన్నడంలో 'ఎస్సార్కే' అనే సినిమాలో కనిపించనుందని సమాచారం.

# ఆ బాలీవుడ్ హీరో రకుల్ ని వదిలేలా లేడే?




బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్ టాలీవుడ్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ని ఇప్పట్లో వదిలేలా కనిపించడం లేదు. తెలుగులో టాప్ హీరోలందరితో కలిసి నటించి టాప్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్... సిద్ధార్థ్ మల్హోత్ర హీరోగా నటించిన 'అయ్యారీ' సినిమాతో బాలీవుడ్ బాట పట్టింది. మధ్యలో క్రిష్ డైరెక్ట్ చేసిన 'కొండ పొలం' చిత్రంలో నటించినా అది పెద్దగా ఆడలేదు. దీంతో మళ్లీ బాలీవుడ్ నే నమ్ముకుంది. అక్కడే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోంది.ఇదిలా వుంటే బాలీవుడ్ హీరో అజయ్ దేవ్ గన్ 'దే దే ప్యార్ దే' మూవీ నుంచి రకుల్ ని వదలడం లేదు. తన ప్రతి సినిమాలో రకుల్ వుండేలా ప్లాన్ చేస్తున్నాడు. ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన 'దే దే ప్యార్ దే' బ్లాక్ బస్టర్ హిట్ గా నిలవడంతో సెంటిమెంట్ గా భావించిన అజయ్ దేవగన్ రకుల్ తో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడు. ఇటీవల తను డైరెక్ట్ చేసిన 'రన్ వే 34'లోనూ రకుల్ ని హీరోయిన్ గా తీసుకున్న అజయ్ తాజాగా మరో మూవీ కోసం కూడా తననే రిఫర్ చేయడం విశేషం.అజయ్ దేవ్ గన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'థాంక్ గాడ్'. టి సిరీస్ మారుతీ ఇంటర్నేషనల్ బ్యానర్ లపై ఇంద్ర కుమార్ రూపొందిస్తున్న ఈ సినిమాలో సిద్ధార్థ్ మల్హోత్ర కూడా నటిస్తున్నాడు. ఫాంటసీ కామెడీ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇందులో అజయ్ దేవ్గన్ వెూద్రన్ చిత్ర గుప్తుడిగా కనిపించబోతున్నాడు.గురవారం ఈ మూవీలో తన ఫస్ట్ లుక్ పోస్టర్ ని సోషల్ మీడియా వేదికగా హీరో అజయ్ దేవ్ గన్ విడుదల చేశారు. బ్లాక్ సూట్ ధరించి సింహాసనం పై సాల్ట్ అండ్ పెప్పర్ లుక్ లో సూపర్ కూల్ గా కనిపిస్తున్న అజయ్ లుక్ ఆకట్టుకుంటోంది.

# శర్వానంద్ తగ్గి ఉండటానికి కారణం అదేనా?

'ఒకే ఒక జీవితం' సినిమాతో ఈ నెల 9వ తేదీన ప్రేక్షకులను పలకరించడానికి శర్వానంద్ రెడీ అవుతున్నాడు. రీతూ వర్మ కథానాయికగా నటించిన ఈ సినిమాలో హీరోకి తల్లి పాత్రలో అమల నటించారు. ఇతర ముఖ్యమైన పాత్రలను నాజర్ .. వెన్నెల కిశోర్ .. ప్రియదర్శి పోషించారు. ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్స్ ను రిలీజ్ చేసిన దగ్గర నుంచి మదర్ సెంటిమెంట్ కి సంబంధించిన సినిమా అనుకున్నారు. 'అమ్మ' పాటను వదిలిన దగ్గర నుంచి



అది మరింత బలపడిపోయింది. ఆ తరువాత మదర్ సెంటిమెంట్ నేపథ్యంలోనే టైమ్ ట్రావెల్ ట్రాక్ నడుస్తుందని రివీల్ చేశారు.ట్రైలర్ రిలీజ్ .. మరికొంత ప్రమోషన్ నడిచిన తరువాత తన చిన్నప్పుడు తల్లి నుంచి పొందవలసిన కొన్ని అనుభూతులను పొందడానికిగాను హీరో తన స్నేహితులతో కలిసి కాలంలో వెనక్కి వెళతాడనే విషయం స్పష్టంగా అర్థం కావడంతో .. ఇదేదో ఇంట్రెస్టింగ్ పాయింట్ ఉందే అని జనాలు ఇటో లుక్ వేశారు. ఇక ఈ సినిమా ప్రమోషన్స్ లో శర్వానంద్ మాత్రమే ఎక్కువగా పాల్గొన్నాడు. ప్రతి ఇంటర్వ్యూలోను ఇదో మంచి సినిమా అని మాత్రమే చెబుతూ వచ్చాడు. ప్రతి ఒక్కరికీ నచ్చుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ వచ్చాడు.ఇక ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా సింపుల్ గానే జరిగింది. ముఖ్య అతిథులు .. పొగడ్తలు .. ప్రశంసలు గట్రా ఏమీ లేకుండా నడిచిపోయింది. శర్వానంద్ పెద్దగా ఏమీ మాట్లాడలేదే .. సినిమాను గురించి ఎలాంటి స్టేట్మెంట్లు ఇవ్వలేదే అని కొంతమంది అనుకున్నారు.కావాలనే శర్వానంద్ అలా ఈ సినిమా విషయంలో సింపుల్ గా మాట్లాడాడనే టాక్ వినిపిస్తోంది. ఈ మధ్య కాలంలో కొంతమంది హీరోలు ప్రీ రిలీజ్ వేడుకలలో రెచ్చిపోతున్నారు. 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ ఖాయం .. రాసిపెట్టుకోండి' అనేస్తున్నారు. ఇంతవరకూ ఇలాంటి ఒక పాయింట్ ను ఎవరూ టచ్ చేయలేదని చెప్పేస్తున్నారు.ఇక ఇలాంటి ఫంక్షన్లకి చుట్టపు చూపుగా వచ్చినవాళు కూడా ఎంతమాత్రం తగ్గడం లేదు. ఇలాంటి హీరో ఒక్కరుంటే చాలు అతన్ని పట్టుకుని ఇండస్ట్రీ మొత్తం ఈదేస్తుంది అంటూ .. ఎంతమొత్తం కలెక్ట్ చేయవచ్చునో కూడా అక్కడే చెప్పేస్తున్నారు.తీరా థియేటర్ కి వెళ్లిన తరువాత ఆ సినిమా అక్కడ మూడు రోజులకు మించి ఉండలేకపోతోంది. ఈ మాత్రం దానికేనా ఇంతమంది ఇన్ని రకాలుగా చెప్పారు అనుకున్న ప్రేక్షకుల నుంచి ట్రోలింగ్ మొదలవుతోంది. అందువల్లనే అలాంటివేం లేకుండా మౌత్ టాక్ తోనే ఈ సినిమా జనంలోకి వెళ్లాలనే ఉద్దేశంతోనే శర్వానంద్ కాస్త తగ్గి మాట్లాడినట్టుగా తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ పాలాసినీని ఫాలో అయిపోవడమే బెటరేమో!

# తల్లి పాలిచ్చేటప్పుడు శిశువు తల్లి స్తనాలు(నిప్పల్స్/ చనుమెనలు) కొరకడంను ఎలా నివారించాలి? :



తల్లి పాలివ్వడం అనేది తల్లి జీవితంలో సంతోషకరమైన అనుభవాలలో ఒకటి, ఇది శిశువుకు పూర్తి పోషణను అందించడమే కాక, పిల్లలకి మరియు తల్లికి మధ్య విడదీయరాని బంధాన్ని ఏర్పరుస్తుంది. ఇది శిశువు మరియు తల్లి ఒకరికొకరు దగ్గరగా బంధం బలపడేలా చేస్తుంది. తల్లి పాలిచ్చేటప్పుడు శిశువు తల్లి స్తనాలు(నిప్పల్స్) కొరకడం ప్రారంభించినప్పుడు సమస్య మొదలవుతుంది.శిశువు పాలు తాగుతున్న సమయంలో తల్లి స్తనాలు కొరకడం వల్ల తల్లికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది తల్లికి భరించలేని నొప్పిని కలిగించడమే కాక, శిశువు మళ్ళీ కొరుకుతారేమోనని అనుకుంటుంది, ఈ భయం కారణంగా, తల్లి పాలిచ్చేటప్పుడు తల్లి భయపడటం ప్రారంభిస్తుంది. ఈ భయం తల్లి పాలివ్వడంలో తల్లి ఆనందాన్ని తగ్గిస్తుంది. ఈ సమస్య ఒకటి లేదా ఇద్దరు తల్లులకు మాత్రమే కాదు, చాలా మంది మహిళలు ఈ సమస్యను ఎదుర్కొంటుంటారు, అలాంటి వారిలో మీరు కూడా ఒకరు అయితే, తల్లి పాలిచ్చేటప్పుడు శిశువు తల్లి స్తనాలు(నిప్పల్స్) కొరకడాన్ని నివారించడానికి కొన్ని నివారణలు ఇక్కడ ఉన్నాయి పరిశీలించండి.

1. శిశువు నోటిలో వేలు ఉంచండి పిల్లవాడు స్తనాలు కొరుకుతుంటే తల్లికి తెలుస్తుంది. పిల్లవాడు కొన్నిసార్లు పాలు తాగడం ప్రారంభ దశలో కొరుకుతాడు ఎందుకంటే అతను ఆకలితో ఉండటం వల్ల, కొన్నిసార్లు కడుపు నిండినప్పుడు అతను కొరుకుతాడు. పిల్లల ప్రవర్తనను గుర్తుంచుకోండి మరియు పిల్లవాడుస్తనాలు కొరుకుతున్నట్లు అనిపించిన వెంటనే వారి నోటిలో వేలు పెట్టండి. ఇలా చేయడం ద్వారా, శిశువు స్తనాలకు బదులుగా మీ వేలిని కొరుకుతుంది. లేదా మీరు ముందుగానే శిశువు ముఖంను మీ వైపు తిప్పి పాలు పట్టడం ద్వారా కూడా చేయవచ్చు, ఇలా చేయడం ద్వారా కూడా పిల్లవాడు స్తనాలను కొరకలేడు. ఒటబ అవకాశం ఉంది. శిశువు స్తనాలు కొరికినప్పుడు, తల్లి నొప్పితో ఉన్నప్పుడు తల్లి సాధారణ ప్రతిచర్య గట్టిగా అరుస్తూ ఉంటారు, కానీ అలా చేయడం ద్వారా మీరు శిశువు స్తనాలు కొరకకుండా ఆపలేరు. ఇది శిశువును భయపడేలా చేస్తుంది లేదా తదుపరిసారి తల్లి పాలివ్వడాన్ని తిరస్కరించవచ్చు. బదులుగా, పిల్లవాడు హాయిగా పడుకుని, అతనిని ముద్దు పెట్టుకుని, ప్రశంసించి, అతనితో ప్రేమగా మాట్లాడనివ్వండి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190